క్లుప్తంగా

ఘనంగా సీత్లా ఉత్సవాలు



జంజారాలతో ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడ తిరుమలనగర్ కాలనీలో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి దేవాలయం వద్ద ఆదివారం సీత్లా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బంజారాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. బంజారాల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు నవారు మల్లారెడ్డి, ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, దిండు వెంకటేశ్‌గౌడ్, ధన్సిన్‌నాయక్, రమేశ్‌చౌహాన్, బాలాజీ, రవి సింగ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ గ్రీన్‌రిచ్ కాలనీ, శ్రీవిద్యటౌన్‌షిప్ కాలనీల్లో ఆదివారం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. బోనాల పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో ఉన్న ఆలయాలను పరిశీలించి అందంగా అలంకరించేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని కోరారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోనాలు పూర్తికాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నారాయణగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రవణ్‌కుమార్, గోపాల్, రవిందర్‌రెడ్డి, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న శ్రీరాములు, పెండ్యాల నర్సింహ, తదితరులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి సత్యసాయినగర్ కాలనీలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఆలయ చైర్మన్ వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణానికి బీజేపీ మహేశ్వరం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహులు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాజుల మధు, నాయకులు విక్కీసాగర్, తుమ్మల రమేష్, జిల్లా రాఘవేందర్, ముఖేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

లింగోజిగూడ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన సత్యం అనారోగ్యంతో చికిత్స పొంది సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.30 వేల చెక్కును ఆదివారం రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, రోహిత్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ కులగణనకు వినతి

హస్తినాపురం: బీసీల కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్. దుర్గయ్యగౌడ్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గయ్యగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు నెలలో స్థానిక సంస్థల ఎన్నికల కన్నా ముందే బీసీ కులగణన చేసి ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కులగణన కోసం రూ.150 కోట్లు బడ్జెట్ కేటాయించడం జరిగిందని వెంటనే కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో మహబూబ్‌నగర్ పంచాయతీ రాజ్ చాంబర్ సెక్రటరీ యాచారం వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది యాదయ్య, బి.రవికుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌కు పరిష్కారమెప్పుడో?

- కలుషితమవుతున్న జల్‌పల్లి చెరువు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో స్థానికులు



బీజాన్ గుట్టపై పేరుకుపోయిన వ్యర్థాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడి ఎనిమిదేళ్లు దాటుతున్నా డంపింగ్ యార్డ్ సమస్య తీరలేదు. మున్సిపాలిటీలోని వార్డుల్లో సేకరిస్తున్న చెత్తను జల్‌పల్లి కార్గో రోడ్డు పక్కన ఉన్న బీజాన్ గుట్టపై డంప్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏళ్ల నుంచి చేస్తున్న డంప్‌తో ప్రస్తుతం ఆ ప్రాంతం గుట్టను తలపిస్తుంది. ఈ డంప్ యార్డ్ దిగువన మామిడిపల్లి నుంచి జల్‌పల్లి చెరువుకు వెళ్లే వాగు ఉంది. వర్షాలు కురిసినప్పుడు వ్యర్థాలు వాగులోకి ప్రవేశించి జల్‌పల్లి చెరువులో కలుస్తున్నాయి. దీంతో స్వచ్ఛమైన జల్‌పల్లి చెరువు కలుషితమవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

కొన్ని వార్డుల చెత్త మాత్రమే...

మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్, జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్‌లలోని కొన్ని వార్డుల్లో మాత్రం ప్రైవేట్ ఆటోలు ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తున్నాయి. రోజు విడిచి రోజు చెత్తను సేకరించి జీహెచ్‌ఎంసీకి తరలిస్తున్నారు. మిగిలిన వార్డుల్లో స్థానికులు కొన్ని పాయింట్ల వద్ద వేస్తున్న చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది ట్రాక్టర్లు, ఆటోలలో నింపుకొని బీజాన్ గుట్టపై వేస్తున్నారు.

సిబ్బంది కొరత..

ఇక్కడ రెగ్యులర్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 300 వరకు ఉండాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది కేవలం 70 మంది మాత్రమే ఉండడం గమనార్హం. దీంతో ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ కష్టతరంగా మారింది. వెంటనే అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు మరిన్ని వాహనాలను సమకూర్చినట్లయితే పరిస్థితిలో మార్పు తేవచ్చని చెబుతున్నారు.

కొంత మేర బయోమైనింగ్‌తో...

గతంలో బీజాన్ గుట్టపై చెత్తను డంప్ చేయరాదని గ్రామస్థుల ఆందోళనతో అధికారులు జల్‌పల్లి చెరువుకట్టపై డంప్ చేస్తున్నారు. అక్కడ గుట్టలుగా పేరుకుపోవడంతో కొన్నాళ్ల పాటు బయో మైనింగ్ ద్వారా వ్యర్థాలను వివిధ దశల్లో శుద్ధి చేసి జీవ ఎరువుగా మార్చారు. కానీ గ్రామం పక్కనే ఇలా గుట్టలుగా పేరుకుపోయిన చెత్తతో వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక కలుషిత నీటి కారణంగా చేపలు సైతం మృత్యువాత పడుతుండడంతో వీటిపైనే ఆధారపడిన జల్‌పల్లి చేపల పెంపకందారులు కూడా చెరువును కాపాడాలని కోరుతున్నారు.

“ డంపింగ్ యార్డ్‌ను తరలించాలి



మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తను అధికారులు పోగుచేసి బీజాన్ గుట్టపై పడేయడం సరైంది కాదు. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ చెరువును సుందరీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– గౌర మురళీ కృష్ణ, జల్‌పల్లి

ప్రజా సమస్యల పరిష్కారంలోనే సంతృప్తి



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: ప్రజా సమస్యలను పరిష్కరించడంలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. దివ్యాంగులైన మండల పరిధిలోని మాన్యగూడకు చెందిన ఎగిరిశెట్టి రాజు, కటికపల్లికి చెందిన సుధాకర్‌కు ఇటీవల వారికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్యాటరీ ట్రైసైకిళ్లను సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఆయా గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా కృషి చేస్తున్నానన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలతో పనిలేదని, పార్టీలకతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసర్లపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

కొత్తూరు: మండలంలోని ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ పరిశ్రమల యాజమాన్యాలను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్థానికంగా కొనసాగుతున్న పలు పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా వారిని 8 గంటలకు బదులుగా 12 గంటలు పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన కార్మికశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా కార్మికశాఖ అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, పాండు, మహేశ్‌గౌడ్, లక్ష్మణ్, గణేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో తిమ్మాపూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు



కందుకూరు పూర్వ విద్యార్థులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల 2001–02 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ రిసార్ట్‌లో వారంతా కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఎవరెవరూ ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో ఒకరిని ఒకరు అడిగి తెలుసుకొని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులు యాదగిరి, రవీందర్, గోవర్ధన్, విజయభాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డిలను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నతపాఠశాలలో..

కందుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 2003–04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆయూబ్, లక్ష్మారెడ్డి, ఆనంద్‌కుమార్, నర్సింహ, శ్రీనివాస్, రమేశ్, లక్ష్మీమైత్రి, కనకమహాలక్ష్మి, శ్రీనివాస్‌ను సన్మానించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కనే విక్రయాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ప్రక్కన, జై శ్రీసాయిరాం నగర్ కాలనీలోకి వెళ్లే రహదారి ప్రక్కనే ప్లాస్టిక్ సామగ్రిని వ్యాపారులు విక్రయిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించడంలేదు. నాగార్జునసాగర్–హైదరాబాద్‌కు ఇది ప్రధాన రహదారి కావడం, విద్యాసంస్థలు ఈ దారిలోనే ఎక్కువగా ఉండటంతో వివిధ వాహనాలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. బీటీ రోడ్డును అంటిపెట్టుకొని ప్లాస్టిక్ సామగ్రిని పేర్చి విక్రయాలు జరుపుతున్నారు. ఎవరైనా కొనుగోలు చేయాలంటే తమ వాహనాలను రోడ్డుపైనే ఆపాల్సిన దుస్థితి. అంతేగాక జైశ్రీసాయిరాం కాలనీ నుంచి వచ్చే వాహనచోదకులు, పాదచారులు ఈ షాపు వద్దనే రోడ్డుపైకి మరలవలసివుంటుంది. కొద్దిగా అజాగ్రత్తగా ఉన్నా, వేగంగా వచ్చే వాహనాలు ఢీ కొనే ప్రమాదం ఉంది. అంతేగాక అక్కడే డిపో ఉండటంతో ఆర్టీసీ బస్సులను కూడా అదే ప్రదేశంలో నిలుపుతుంటారు. ఏదైనా ప్రమాదం ముంచుకోస్తుందంటే రోడ్డు ప్రక్కకు జరుగుదామన్న స్థలం లేదు. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. కాబట్టి అధికారులు ప్రమాదాలు జరుగకముందే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆర్టీసీ డిపోవద్ద బీటీ రోడ్డును అంటిపెట్టుకొని ఉన్న ప్లాస్టిక్ దుకాణం



సమావేశంలో మండల విద్యాధికారి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మండల విద్యాధికారి కృష్ణ

మహేశ్వరం: కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ఎంఈఓ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇమాంగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, దాతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్యతో పాటు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు ఇవ్వడంతో పాటు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్‌డ్రెస్, వైట్ సాక్స్‌లను దాతలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకుమారి, గ్రామ పెద్దలు, దాతలు శివయ్య గౌడ్, బంటు రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు గోవర్ధన్, శ్రీరాములు, జానకీరామ్, రాములు, వీరమల్లేశ్ పలువురు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు బాధాకరం



పోలీస్ వాహనంలో ఎక్కుతున్న బీఆర్‌ఎస్ యువజన నాయకుడు నిట్టు జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం: ముందస్తు అరెస్టులు బాధాకరమని బీఆర్‌ఎస్ యువజన నేతలు పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బీఆర్‌ఎస్ యువజన నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని బీఆర్‌ఎస్‌తోపాటు వివిధ సంఘాలు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఉండేందుకు అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో నిట్టుజగదీశ్వర్, జెర్కొని రాజుతోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఎం సభ పూర్తయిన అనంతరం వారిని విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

ఇబ్రహీంపట్నం రూరల్: అబ్దుల్లాపూర్‌మెట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌కు చెందిన ప్రసాద్‌గౌడ్‌ను ఆదిబట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీతో విడుదల చేశారు.

జోరందుకున్న సాగు పనులు

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు

తలకొండపల్లి: మండలంలో సాగు పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు వర్షధార పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. కొన్నేళ్లుగా పత్తి సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇతర పంటలతో పోల్చితే పత్తికి పెట్టుబడి వ్యయం తక్కువ. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు అంటున్నారు. అదే విధంగా మొక్కజొన్న ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి రానుంది. కందులు, పెసర, నువ్వులు, మినుములు, పంటలు పండిస్తే ఎకరాకు దిగుబడి 2 క్వింటాళ్లకు మించి రాకపోవడంతో రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పత్తి పంటల వైపూ మొగ్గు చూపుతున్నారు. సుమారుగా మండలంలో 65 నుంచి 70 శాతం వరకు విత్తనాలు నాటడం పూర్తయ్యినట్లు రైతులు చెప్పుతున్నారు. మండలంలో వ్యవసాయ సాగు విస్తీర్ణం సుమారుగా 30 వేల ఎకరాలుండగా, ఇప్పటి వరకు వివిధ రకాల పంటలను 15 వేల నుంచి 20 వేల ఎకరాల వరకు రైతులు సాగు చేశారు. గత వానకాలంలో మొక్కజొన్న 13 వేల ఎకరాల్లో, పత్తి 7వేల ఎకరాల్లో, వరి 8 వేల ఎకరాల్లో సాగు చేశారు. అక్టోబర్‌లో వేరుశనగ సాగు చేయనున్నారని, ఆ పంట కోసం 20 శాతం వరకు సాగు భూమిని వదిలినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

సీజనల్‌పై అప్రమత్తం

- వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు
- అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ
- వ్యాధులు ప్రబలితే తక్షణమే చికిత్స అందించేందుకు ఏర్పాట్లు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

చేవెళ్ల: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. వ్యాధుల వ్యాప్తి కారకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈగలు, అపరిశుభ్రత, నిల్వ నీరు, మురుగునీరు, దోమకాటుతో అతిసారి, కామెర్లు, టైఫాయిడ్, మలేరియా కలరా డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని అప్రమత్తం చేస్తున్నారు. వ్యాధులబారిన పడితే వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా..

వాతావరణం చల్లబడడంతోపాటు ప్రతి రోజూ ఓ మోస్తరు నుంచి ముసురు కురుస్తున్నది. దీంతో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశాలున్నాయి. ఇప్పటికే చలి, జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. టైఫాయిడ్ జ్వరాలతో మొదలై సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో ఆదిలోనే అరికట్టేందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

డెంగీ..

డెంగీని వ్యాపింపచేసే దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టిన వారం తర్వాత ఒక్కసారిగా తీవ్ర జ్వరం వస్తుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పులు కలుగుతాయి. నోరు ఎండిపోవడం, అధిక దాహం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, బీపీ తగ్గడం లక్షణాలు కనిపిస్తాయి. డెంగీకి కారణమయ్యే దోమ నల్లగా ఉండి తెల్లని మచ్చలు ఉంటాయి. పగటి పూట ఎక్కువగా సంచరిస్తుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, రోడ్లపై నిలిచే నీరు, పాత టైర్లు, కూలర్లలో నిల్వ ఉండే నీటిలో డెంగీ కారక దోమ పెరుగుతుంది.

డయేరియా..

వర్షాకాలంలో వచ్చే మరో వ్యాధి డయేరియా. కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడంతో ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన వారికి నీళ్ల విరేచనాలతో పాటు జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. రోజులో 4 నుంచి 5 సార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. ఎక్కువ సార్లు విరేచనాలు కావడంతో శరీరంలోని నీరు, లవణా లు, పొటాషియం, గ్లూకోజ్ శాతం తగ్గి నీరసించిపోతారు. డయేరియా వచ్చిన వారి నుంచి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. షుగర్ వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

మలేరియా..

మలేరియాను వ్యాపింపజేసే దోమలు మురుగు కాల్వల్లోని నీటిలో పెరుగుతాయి. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోకుంటే ప్రమాదకరం. లివర్ కిడ్నీ, రక్తనాళాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

“ జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాల కారణంగా నీటి నిల్వలతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్పత్రులల్లో డెంగీ కేసులు నమోదు కాలేదు. కానీ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉపవైద్యాధికారి